అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు చేయాలి

● లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కాంతయ్య

లక్షెట్టిపేట, అక్టోబర్ 3: దసరా పండుగ నేపథ్యంలో అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కౌన్సిలర్లు, అధికారులకు లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ నలుమాసు కాంతయ్య అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దసరా, దుర్గా నవరాత్రి వేడుకల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సభ్యుల సమక్షంలో చర్చించి పనులపై ఆమోదించారు. పట్టణంలో ప్రతి వార్డులో పారిశుధ్య పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా వార్డు కౌన్సిలర్లను చైర్మన్ కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, మేనేజర్ శ్రీహరి, వార్డు కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న బతుకమ్మ చీరలు

చీరెలను పరిశీస్తున్న తహసీల్దార్, డీటీ, ఆర్ఐ

హాజీపూర్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగకు మహిళలకు అందించే బతుకమ్మ చీరలు మంగళవారం హాజీపూర్ తహసీల్ కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ పరిశీలించారు. మండలంలోని 6,930 మంది మహిళలకు ప్రభుత్వం తరపున బతుకమ్మ చీరలను త్వరలోనే రేషన్ షాపుల ద్వారా అందించనున్నట్లు హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఆర్ఐ మంగ తహసీల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అభినందనలు తెలిపిన భారత జాగృతి నాయకులు

ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాగృతి నాయకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మంగళ వారం జిల్లా భారత జాగృతి నాయకులు హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చట్ట సభల్లో మహిళా బిల్లు కోసం ఢిల్లీలో దీక్ష చేపట్టి, బిల్లు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో జాగృతి జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేమ్‌రావు, లింగంపల్లి ఆదిత్య తదితరులున్నారు.

మంచిర్యాలలో పని చేసేందుకు అవకాశమివ్వాలి

మాట్లాడుతున్న నస్పూర్ ప్లంబర్ అసోసియేషన్ నాయకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : ప్లంబింగ్ పని చేస్తూ జీవిస్తున్న కార్మికులకు మంచిర్యాలలో పని చేసుకునేందుకు అవకాశం కల్పించాలని నస్పూర్ మండల ప్లంబర్ యూనియన్ నాయకులు కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మంచిర్యాల ప్లంబర్ అసోసియేషన్ నాయకులు నస్పూర్ నుంచి వచ్చి పని చేసుకునే ప్లంబర్లను బెదిరిస్తున్నారని, జరిమానాల పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. మంచిర్యాలలో పని చేయాలంటే సంఘానికి రూ. 20 వేలు చెల్లించాలని అంటున్నారని తెలిపారు. అనంతరం మంచిర్యాల పోలీసులకు వినతి పత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నస్పూర్ మండల ప్లంబర్ యూనియన్ అధ్యక్షుడు రాకం కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా సంతోష్ నాయక్, కోశాధికారి రమేశ్, సతీశ్, అంజిత్ రావు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 30 లోగా దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నవంబర్ 30లోగా అప్లికేషన్లు సబ్మిట్ చేయాలని డీఈవో యాదయ్య మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ ప్రారంభమైందని, ఎన్ఎంఎంఎస్ డిసెంబర్ 2022లో ఎంపికైన, ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు, గతంలో సెలెక్టై ప్రస్తుతం 10, 11, 12 తరగతుల విద్యార్థులు రెన్యువల్స్ దరఖాస్తులను గడువులోపు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలని కోరారు. ఈ అప్లికేషన్లను ఆయా పాఠశాలల హెచ్ఎంలు వారి పాఠశాల లాగిన్ ద్వారా వెరిఫికేషన్ చేసి డిసెంబర్ 15వ తేదీలోపు డీఈవో కార్యాలయంలో హార్డ్‌కాపీలను అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్(http://bse.telangana.gov.in)లో చూడవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీపై శిక్షణ

హాజీపూర్, అక్టోబర్ 3 : జాతీయ ఉపాధిహామీ పథకంలో 100 రోజుల పని పూర్తి చేసిన కుటుంబాల్లో 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు గల వారిని గుర్తించి శిక్షణనివ్వనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ హై, ఏపీవో మల్లయ్య తెలిపారు. మండలంలోని గుడిపేట గ్రామంలో ఉన్న రైతు వేదికలో నేటి నుంచి ఐదు రోజుల పాటు బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్వంలో వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్రీడా కిట్లు అందజేత

పంచాయతీ కార్యదర్శికి క్రీడా కిట్లను అందజేస్తున్న ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి

హాజీపూర్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీసేందుకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఇటీవల మండల కేంద్రానికి క్రీడా పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. ఆ క్రీడా పరికరాలను మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ క్రీడా పరికరాలు గ్రామీణ ప్రాంతాల యువకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. యువత అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

నగదు, సరుకులు అందజేస్తున్న సభ్యులు

లక్షెట్టిపేట, అక్టోబర్ 3: పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన యువకుడు శివాజీ నాయక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిది పేద కుటుంబం కావడంతో శ్రీ శివ సాయి గణేశ్ సేవా సమితి సభ్యులు సోమవారం రాత్రి బాధితుడికి కొంత నగదుతో పాటు సుమారు రూ.7 వేల విలువైన నిత్యావసర సరుకులను కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటారు. రానున్న ఐదు నెలల వరకు నిత్యావసర సరుకులు అందజేస్తామని ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులతో తైక్వాండో అసోసియేషన్ నాయకులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : జగిత్యాల జిల్లాలోని విరూపాక్ష గార్డెన్స్‌లో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చి రామారావు, వెంకట స్వామి మంగళ వారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఏడు బంగారు పతకాలు, 13 వెండి పతకాలు సాధించారన్నారు. వీరు నవంబర్‌లో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు కోచ్‌లు మండ శ్రీనివాస్, శ్రావణ్, అజయ్, రోహిత్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

'ది హ్యాపీ స్కాలర్' విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన ది హ్యాపీ స్కాలర్ విద్యార్థులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : జగిత్యాల జిల్లాలో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లాకు చెందిన ది హ్యాపీ స్కాలర్ స్కూల్ విద్యార్థులు బీ నిహాల్ కృష్ణన్, డీ వీక్షిత్, ఏ సాత్విక్ రాష్ట్ర స్థాయిలో రజత, కాంస్య పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విక్రమ్ రావు మంగళ వారం తెలిపారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ వుషూ పోటీలకు ఎంపిక

ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పరిమిల

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన 67వ జోనల్ స్థాయి వుషూ జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పాఠశాలల క్రీడల ప్రధాన కార్యదర్శి పరిమిల తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

దండేపల్లి, అక్టోబర్ 3: దండేపల్లి మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన బీ పుష్పలతకు సోమవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. దవాఖానకు తరలిస్తుండగా నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది సుఖప్రసవం చేశారు. అనంతరం తల్లి, బిడ్డను జగిత్యాల ప్రధాన దవాఖానకు తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అంబులెన్స్ ఈఎంటీ నర్సయ్య, పైలెట్ సత్తయ్యకు పుష్పలతతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.